క్లుప్తంగా

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

మహాముత్తారం: మండలంలోని క్రీడాప్రాంగాణాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నిరుపయోగంగా మారాయి. దీంతో మంగళవారం 'సాక్షి'లో ఆటలు ఆడేదెలా అనే కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ సిబ్బందితో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి డోజర్ ద్వారా క్రీడా ప్రాంగణాన్ని చదును చేయించారు. దీంతో క్రీడాకారులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ



ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయి గ్రామంలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రనీత్ కుమార్ మహిళలో నెల వారి సమస్యలపై తీసుకోవాలిన్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సరైన ఆహారం తీసుకోవటం, రోజు వారి వ్యాయమంపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

అడవి పంది దాడి

● యువకుడికి గాయాలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కుదురుపల్లి గ్రామానికి చెందిన చల్ల రాజయ్య అనే యువకుడు తునికాకు సేకరణ కోసం సమీపంలోని మంగళవారం అడవిలోకి వెళ్లాడు. ఈక్రమంలో అడవి పంది దాడి చేసింది. మోకాలి కింద తీవ్ర గాయం కాగా స్థానికులు సమీపంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

రాజీనామా

కాటారం: కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాయిత విఠల్ ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడికి రాజీనామా లేఖను పంపించినట్లు తెలిపారు. సనాతన ధర్మాన్ని పాటిస్తూ ఆధ్యాత్మికంగా ముందుకు వెళ్తున్న క్రమంలో రాజకీయ పార్టీలకు అతీతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పార్టీకి రాజీనామా చేసినట్లు విఠల్ పేర్కొన్నారు.

కొనసాగుతున్న క్యాంపు



వాజేడు: మండల పరిధిలోని కోయ వీరాపురం గ్రామంలో 14 ఏళ్ల లోపు బాల బాలికల క్రీడల క్యాంపు ఉత్సాహంగా కొనసాగుతుంది. కోయ వీరాపురం గ్రామంలో కొన్ని రోజులుగా వేసవి క్రీడల క్యాంపును నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు ఉదయం సాయంత్రం శిక్షణ ఇస్తున్నారు. వాలీబాల్, ఫిట్‌నెస్‌పై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. క్యాంపు ముగిసిన వెంటనే క్యాంపులో పాల్గొన్న వారికి జిల్లా నుంచి ధ్రువీకరణ పత్రాలను ఇవ్వనున్నట్లు క్యాంపు శిక్షకుడు ఉయిక నవీన్ తెలిపారు.

కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి



ములుగు రూరల్: అవగాహన కల్పిస్తున్న ఏఓ సంతోష్



వాజేడు: అవగాహన కల్పిస్తున్న ఏఓ నర్సింహారావు

ములుగు రూరల్: రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి మునుకుంట్ల సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని జగ్గన్నపేట, పులిగుండం గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. తప్పకుండా బిల్లు రశీదు తీసుకొని పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని అన్నారు. గ్రామాల్లో ఎవరైన తిరిగి విత్తనాలు అమ్మకాలు చేపడితే కొనుగోలు చేయకూడదని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. సరైన వర్షాపాతం నమోదయ్యాక మాత్రమే విత్తనాలను వేసుకోవాలని, పొడి దుక్కిలో విత్తనాలు వేయకూడదని అన్నారు. అనంతరం విత్తనాలు అమ్మకాలు చేపడుతున్న దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

లూజు సంచుల్లోని విత్తనాలను విక్రయించొద్దు

వాజేడు: ప్రైవేట్ వాహనాల్లో వచ్చే లూజు సంచుల్లో విత్తనాలను రైతులు కొనవద్దని మండల వ్యవసాయ అధికారి గుంటుక నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని పేరూరు రైతు వేదికలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలకు సంబంధించి రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన విత్తనాలను కొనవద్దన్నారు. డీలర్లు స్టాక్ బోర్డు, సరుకు వివరాలను పొందు పర్చాలని, ఎమ్మార్పీకి మించి విత్తనాలను అమ్మితే శాఖా పరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. వాజేడు సొసైటీ పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు పట్టా, ఆధార్ జిరాక్స్‌లు ఇచ్చి కొనుగోలు చేసుకోవాలన్నారు. 30 కేజీల బస్తా రూ.1,116 చెల్లించాలని తెలిపారు.

మొగుళ్లపల్లి: మండలంలోని వివిధ విత్తనాల దుకాణాలను మంగళవారం ఎస్సై అశోక్, ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ.. గడువు ముగిసిన విత్తనాలు, లేబుల్స్ లేనివి, లూజ్ విత్తనాలు నిలువ ఉంచిన అమ్మిన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాల విషయంలో రైతాంగం అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు చేసిన విత్తనాలకి సరిన రశీదులు తీసుకోవాలన్నారు. ఎస్సై వెంట మండల వ్యవసాయ అధికారి సురేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: తనిఖీ చేస్తున్న అధికారులు

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 83 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 34 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు రేష్మ, ఆఫీఫాతబుసం, దినకరన్, రాకేష్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం 12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు ఉపకార వేతనంగా, ఉన్నత చదువులు చదువుకోవడానికి ప్రభుత్వము అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులతో పాటు గైడ్‌గా వ్యవహరించిన ఉమారాణి, వీరయ్య ఉపాధ్యాయ బృందాన్ని, అలాగే ఎస్ఎస్‌సీ 2024లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విద్యార్థులను మంగళవారం అభినందించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సదానందం, ఉపాధ్యాయులు నరసింహస్వామి, సంపత్ కుమార్, వీరయ్య, ఉమారాణి, రాణి, రవీందర్, శ్రీధర్ స్వామి పాల్గొన్నారు.

భద్రాచలానికి కాలినడకన భక్తులు



గోవిందరావుపేట: భద్రాచలం వెళ్తున్న స్వాములు



టేకుమట్ల: కొండగట్టుకు వెళ్తున్న మాలధారులు

గోవిందరావుపేట: మండల పరిదిలోని చల్వాయి గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారణ భక్తులు మంగళవారం భద్రచలానికి పాదయాత్రగా బయలుదేరారు. నాలుగు రోజుల పాటు పాదయాత్రగా వెళ్లి హనుమాన్ జయంతి నాటికి భద్రాచలం చేరుకుంటారు.

టేకుమట్ల: చిట్యాల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారణ భక్తులు మంగళవారం కొండగట్టుకు కాలినడకన యాత్ర ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం వరకు కొండగట్టుకు చేరుకుంటామని భక్తులు తెలిపారు. గతంలోను కొండగట్టుకు పాదయాత్ర చేశామని, ఇప్పుడు కూడా చేయడం ఆనందంగా ఉందన్నారు.

హామీలు అమలు చేయాలి

కాటారం: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్కూరి శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో రైతుల కోసం పేర్కొన్న హామీలను వెంటనే నెరవేర్చాలని పేర్కొన్నారు. ధరణి లోపాలను సరి చేయడంతో పాటు అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని తెలిపారు. 2011 కౌలు చట్టాన్ని అమలు చేయాలి, సాగు రైతులకు రూ.15000 వేల రైతు భరోసా అందించాలని అన్నారు. సబ్సిడీపై రైతులకు మైక్రో ఇరిగేషన్ పథకాలు అమలు చేయాలని తెలిపారు. రూ. 2లక్షల లోపు రుణమాఫీ ఏకకాలంలో మాఫీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఇసునపు మహేందర్, కిశోర్, మానస, మంథెన సుధాకర్, మేడి సందీప్‌రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్

సమస్యలు పరిష్కరించాలని వినతి

భూపాలపల్లి రూరల్: ఎన్పీడీసీఎల్ విద్యుత్ ఆర్టిజన్స్ అన్‌మ్యాడ్, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. తెలంగాణ స్టేట్ యూనైటైడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నాయకులు మంగళవారం భూపాలపల్లి సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్సూర్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. డివిజన్ ఇంజనీర్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. విద్యుత్ శాఖ కార్మికులు ఆర్టిజన్లు ఉద్యోగుల కన్వర్షన్ అన్‌మ్యాడ్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలని కోరారు. జేఎల్‌ఎంలకు, రెగ్యులర్ ఉద్యోగులకు ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. పలు సమస్యలపై జూన్ 10న ఎన్పీడీసీఎల్ సీఎండీకి మెమోరాండాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖలోని సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి పోరాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా యూనియన్ నాయకులు తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోసరి భాస్కర్ జిల్లా కార్యదర్శి మోత్కూరి కోటితో పాటు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వ్యర్థాలను కాలిస్తే నష్టం..

● పంట కొయ్యలను తగులబెడితే తగ్గనున్న దిగుబడి
● అవగాహన లేక కాల్చేస్తున్న రైతులు



కుందనపల్లిలో కాల్చుతున్న వ్యర్థాలు

టేకుమట్ల: రైతులు వ్యవసాయ పంటలలో శ్రమను తగ్గించుకుంటూ యాంత్రికతను ఉపయోగించుకుంటూ వ్యవసాయాన్ని చేస్తున్నారు. అదే క్రమంలో వ్యవసాయంలో భవిష్యత్ నష్టాలను సైతం లెక్క చేయకుండా రైతులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. రైతులు యాసంగిలో వరి, మొక్కజొన్న, పుచ్చకాయ, పల్లి తదితర పంటలను వేస్తారు. యాసంగిలో జిల్లాలో సుమారుగా రైతులు 9వేలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న, వరి పంటను సుమారు 52వేల ఎకరాల్లో సాగు చేశారు. కాగా, పంటలు పూర్తయ్యాక మళ్లీ వానాకాలం సీజన్ కోసం వరి పొలంలోని పశుగ్రాసాన్ని పశువులు ఉన్న రైతులు మాత్రమే నిల్వ చేసుకుంటున్నారు. మిగతా రైతులు మాత్రం పొలంలోనే కాల్చేస్తున్నారు. ఇక మొక్కజొన్న రైతులు పూర్తిగా పంటపొలంలోనే దగ్ధం చేస్తున్నారు.

పొలంలోనే దున్నడం వల్ల లాభాలు...

పంట పూర్తి అయ్యాక వరి పొలంలోనే కలియదున్నడం వల్ల నేలలో సేంద్రియ కర్బన శాతం పెరడంతో పాటు, సుమారు ఎకరాకు టన్ను ఎరువు తయావుతోంది. తద్వారా సుమారుగా 5 నుంచి 10 శాతం పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే పంట అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా రూపాంతరం చెంది పంటకు సేంద్రియ ఎరువుగా మారుతోంది. దాని ద్వారా పంటలో డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. అంతే కాకుండా మొక్కలకు 2శాతం నత్రజని, 4శాతం ఫాస్పరస్ అదనంగా లభిస్తుంది. జింక్, మాంగనీస్, క్యాల్షియం, ఐరన్ వంటి సూక్ష్మదాతువులు అంది పంటకు మేలు చేకూర్చడంతో పాటు నీటి నిల్వ పెరుగుతోంది. వరి కొయ్యలను భూమిలో కలియ దున్నితే పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి. పొలం దున్నే ముందే ఎకరాకు 50కిలోల సూపర్ ఫాస్పేట్‌ను చల్లితే సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుకునే అవకాశం ఉంటుంది.

నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలు..

వరి కొయ్యలు, మొక్కజొన్న పంటలకు నిప్పు పెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు, అత్యధిక ఉష్ణోగ్రతతో నేల భూసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా భూమిలో ఉండే నత్రజని, పాస్పరస్ వంటి పోషక పదార్థాలతో పాటు, పంట దిగుబడి తగ్గిపోతుంది. అలాగే భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కూడా కాలిపోతాయి. అంతే కాకుండా పంటకు మేలు చేసే ఖనిజ లవణాలు, సూక్ష్మజీవులు కూడా కాలిపోతాయి. అలాగే మంటలకు వివిధ రకాల జీవులు సైతం మృత్యువాతపడే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా అగ్ని ప్రమాదలు జరిగే అవకాశం ఉంది.

పంట కొయ్యలను కాల్చొద్దు



రైతులు పంట కొయ్యలను కాల్చొద్దు. పంట వ్యర్థాలను కాల్చివేయడం వలన నేలలోని మంటల్లో గంధకం, పాస్పరస్ గాల్లో కలిసి ఉప్పు మాత్రమే మిగులుతుంది. అంతే కాకుండా రైతుల పంటలకు పరోపకారిగా ఉపయోగపడే జీవులు, ఇతర జీవరాశులు సైతం మంటల్లో చలిపోతాయి. కావున పంట వ్యర్థాలను తగలబెడితే వ్యర్థం, మురగబెడితే లాభం.

– విజయభాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి, భూపాలపల్లి

దగ్ధం చేయడం వల్ల నష్టం



పాడి రైతులు ఎక్కువగా లేకపోవడం మూలంగా వరి రైతులు పశుగ్రాసాన్ని పొలాల్లోనే దగ్ధం చేస్తున్నారు. పంటలను పొలాల్లో దగ్ధం చేయడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. పంటలను దగ్ధం చేయడం వల్ల నేలలోని కర్బన రసాయనాలు పూర్తిగా నిర్వీర్యం కావడంతో నేల సారవంతం క్షీణించి పోతుంది. కావున రైతులు ఎక్కువగా సేంద్రియ ఏరువుల వినియోగాన్ని పెంచుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, టేకుమట్ల

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

బంగారం, వెండి ఆభరణాలు, లాప్‌టాప్, బైక్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నిందితులతో పోలీసులు

మణుగూరు టౌన్: ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. పలుచోట్ల చోరీలకు పాల్పడుతూ పట్టుబడి జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. అయినా తీరు మార్చుకోక మళ్లీ చోరీలు చేస్తున్న ఓ వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సీఐ సతీశ్‌కుమార్, ఎస్సైలు ప్రసాద్, రాజేశ్ తెలిపిన వివరాలు.. మణుగూరులో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి పల్సర్ బైక్‌పై అశ్వాపురం – మణుగూరు వైపు వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా భూపాలపల్లికి చెందిన దొరిశెట్టి స్వామి నిరంజన్‌గా తేలింది. ఆయన మణుగూరుతో పాటు భద్రాచలంలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి డిసెంబర్‌లో జైలుకు వెళ్లి ఈనెల 7వ తేదీన బెయిల్‌పై బయటకు వచ్చినట్లు గుర్తించారు. ఆపై ములకలపల్లికి చెందిన జున్నూరి శ్రీనుతో కలిసి మణుగూరులోని పీ.వీ.కాలనీతో పాటు కొత్తగూడెం ఏరియాలోని పలు ఇళ్లల్లో జున్నూరి శ్రీనుతో కలిసి చోరీ చేశాడు. చోరీ చేసిన వస్తువులను భద్రాచలానికి చెందిన బానోత్ మోహన్‌కు విక్రయించినట్లు నిందితుడు ఇచ్చిన సమాచారంతో 9తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు, ల్యాప్‌టాప్, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకుని మోహన్, స్వామి నిరంజన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. అలాగే, పరారీలో ఉన్న శ్రీను కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. కాగా, స్వామి నిరంజన్‌పై గతంలో భూపాలపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లి, వెంకటాపురం, గణపురం, భద్రాచలం, మణుగూరు పోలీస్‌స్టేషన్లలో కలిపి 14 చోరీ కేసులు ఉండగా.. జైలుకు వెళ్లి బెయిల్‌పై రాగానే చోరీలకు పాల్పడడాన్ని అలవాటుగా మార్చుకున్నాడని సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి



మృతి చెందిన గేదెలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మెట్‌పల్లి పరిధిలోని బీరాసాగర్ లక్ష్మీపంపుహౌస్‌కు చెందిన కూలీల కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు వద్ద విద్యుత్ కనక్షన్ తీగలు గాలిదుమారానికి తెగిపడి సోమవారం రాత్రి రెండు గేదెలు మృతి చెందాయి. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి గ్రామానికి చెందిన దాసరి సమ్మయ్య, శ్రీరాముల బక్కయ్యలకు చెందిన రెండు గేదెలు విద్యుత్ తీగలు తెగి పడి మృతి చెందాయి. వాటి విలువ రూ.80 వేల వరకు ఉంటుందని తమను ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఎన్పీడీసీఎల్ లైన్ ఇన్స్‌పెక్టర్ సదానందంను సంప్రదించగా పంపుహౌస్‌కు సంబంధించిన విద్యుత్ తీగలు తెగిపడినట్లు తెలిపారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



చిట్యాల: శోభాయాత్రలో హనుమాన్ మాలధారులు



ఏటూరునాగారంలో..



కొత్తపల్లిగోరిలో..

చిట్యాల: మండల కేంద్రంలో అంజనేయ స్వామి శోభాయాత్రను మంగళవారం సాయంత్రం భక్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ఊరేగింపుగా గ్రామంలోని అన్ని వీధుల గుండా తిరిగారు. మహిళలు , భక్తులు స్వామి వారికి కొబ్బరికాయాలతో, పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు నేపాలి వేణుసింగ్, పిట్టల నాగరాజు, పాముకుంట్ల రవి, ఆకుల హరీష్, బుర్ర చక్రపాణి, ఆకుల రాజు, గడ్డం కొమురయ్య, తాటిపల్లి శ్రీనివాస్, కొడెల నరేష్, ప్రవీణ్, సుమన్, ఎల్లయ్య, సదానందం, సాయిచరణ్, మాసు రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో హనుమన్ నగర సంకీర్తన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహంచారు. గురు స్వామి దాసరి సంజీవయ్య ఆధ్వర్యంలో సదాశివ దేవాలయం నుంచి వేడుకలు ప్రారంభించారు. హనుమంతుని ప్రతిమను ఊరేగింపుగా మాలధారులు భక్తి, భజనలతో, కోలాటాలతో హోరెత్తిపోయింది. స్వామి వారికి మహిళలు నీళ్ల ఆరగించి, మంగళహారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో మాలధారులు నిమ్మల రాజు, పుట్ట రాంబాబు, పసుల రాకేష్, నిమ్మల రాజేందర్, సాదు రఘుపతి, పుట్ట రమేష్, మనోహర్, దేవరాజు, ప్రకాష్, సుమన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలో రామాలయం ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ నగర సంకీర్తన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగ హనుమాన్ మాలధారులు రామాలయం వద్ద నుంచి నగర సంకీర్తన ర్యాలీని ప్రారంభించి మండలంలోని అన్ని వీధుల్లో హనుమాన్ నామ స్మరణతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ గురుస్వామి సాంబయ్య, అంజన్న స్వాములు పాల్గొన్నారు.